ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ వేగిరం చేయండి

బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్లకు చెల్లింపులు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం మంత్రులు సీతక్క, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరంగల్ స్మార్ట్ సిటీ పనులు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, తాగునీరు, ఇందిరమ్మ ఇండ్లు తదితర అంశాలపై చర్చించారు. బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్లకు తక్షణం చెల్లించాలని ఆదేశించారు.

సీజన్‌కు ముందే విత్తనాలు సిద్ధం చేయాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, మార్చి 28 (నమస్తేతెలంగాణ): వానకాలం సీజన్‌కు ముందే రైతులకు విత్తనాలు సిద్ధంగా ఉంచాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. హైదరాబాద్‌లో శుక్రవారం వ్యవసాయాధికారులు, విత్తన కంపెనీల ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నకిలీ విత్తనాలపై కఠినంగా వ్యవహరించాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి మాట్లాడుతూ వానకాలం సీజన్‌లో 66.80 లక్షల ఎకరాల్లో వరి, 6 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 50 లక్షల ఎకరాల్లో పత్తి, 9 లక్షల ఎకరాల్లో సోయా సాగయ్యే అవకాశం ఉందని తెలిపారు.

లబ్ధిదారుల లిస్టులో పేరుంటే రేషన్

పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): కార్డు ఉన్నా, లేకున్నా లబ్ధిదారుల లిస్టులో పేరు ఉంటే రేషన్ తీసుకోవచ్చని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడి స్పష్టంచేశారు. శుక్రవారం సెక్రటేరియట్‌లో సివిల్ సప్లయ్ కమిషనర్ చౌహాన్, అధికారులతో కలిసి మంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఉగాది సందర్భంగా ఆదివారం హుజూర్‌నగర్‌లో రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డులు, 2.85 కోట్ల లబ్ధిదారులు ఉన్నట్టు వెల్లడించారు.

ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగాలు

మంత్రి దామోదర

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): వర్గీకరణ ప్రకారం గ్రూపుల వారీగా ఉద్యోగాలు రిజర్వ్ చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. హైదరాబాద్‌లోని మంత్రి దామోదర నివాసంలో బుడగజంగాల నాయకులు, యువకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ షెడ్యూల్ కులాల్లో బుడగ జంగాల అక్షరాస్యత చాలా తక్కువగా ఉందని చెప్పారు. ఈ కులాన్ని గ్రూప్-1లో చేర్చినట్టు స్పష్టంచేశారు. ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. త్వరలోనే ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల అవుతాయని తెలిపారు.

తాగునీటి ఇక్కట్లు తలెత్తవద్దు

మంత్రి సీతక్క

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ఎర్రమంజిల్ మిషన్ భగీరథ కార్యాలయంలో సీఈ, ఎస్ఈ, ఈఈ, డీఈలతో జిల్లాలవారీగా తాగునీటి సరఫరాపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. భగీరథ బోర్డు చైర్‌పర్సన్‌గా మంత్రి సీతక్క, వైస్ చైర్మన్, ఎండీగా పీఆర్ సెక్రటరీ లోకేశ్‌కుమార్, ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఎంఏయూడీ కమిషనర్ శ్రీదేవిని నియమించారు.

ఇదెక్కడి 'బిల్డ్‌నౌ'!

- ఓసీ, టీడీఆర్‌తో అదనపు అంతస్తుకు కానరాని ఆప్షన్
- వచ్చే నెల 2 నుంచి టీజీ బీ-పాస్ విధానానికి స్వస్తి
- కొత్త విధానంలో లోపాలు.. సవరించని అధికారులు
- హడావుడి నిర్ణయాలపై నిర్మాణదారుల అసంతృప్తి

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ): సామాన్యులు సైతం సులభంగా ఇంటి నిర్మాణ, లే అవుట్ అనుమతులు పొందేలా 'బిల్డ్‌నౌ' విధానాన్ని అందుబాటులోకి తెచ్చామని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ, ఆచరణలో అది అంతా డొల్ల అని తేలిపోయింది. బిల్డ్‌నౌ యూజర్ ఫ్రెండ్లీగా పనిచేస్తుందని, డ్రాయింగ్స్ పరిశీలన నిమిషాల్లోనే పూర్తవుతుందని, ఇంటి అనుమతులు సులభతరం అవుతాయంటూ ఈ నెల 20న రవీంద్రభారతి వేదికగా 'బిల్డ్‌నౌ' విధానానికి శ్రీకారం చుట్టిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇదే వేదికగా ముగ్గురికి ఇంటి అనుమతుల పత్రాలను కూడా మంజూరు చేశారు. ఇది జరిగి ఎనిమిది రోజులైనా ఈ విధానం ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. అనేక లోపాలు వెంటాడుతునే ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న టీజీ బీ-పాస్ విధానాన్ని ఏప్రిల్ 2 నుంచి పూర్తిస్థాయిలో నిలిపివేస్తున్నట్టు ఇప్పటికే టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు ప్రకటించారు. ప్రాసెస్‌లో ఉన్న దరఖాస్తులు తప్ప కొత్తవి బిల్డ్‌నౌ విధానంలోనే తీసుకుంటామని తేల్చి చెప్పారు. అనుమతుల కోసం బిల్డ్‌నౌను ఆశ్రయిస్తున్న దరఖాస్తుదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఓసీ (ఆక్యుపెన్సీ సర్టిఫికెట్/భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఇచ్చేది), ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్)కు సంబంధించిన ఆప్షన్స్ ఈ విధానంలో కనబడటం లేదని నిర్మాణదారులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

ఓసీ, టీడీఆర్ అనుమతులకు నో ఆప్షన్

జీహెచ్ఎంసీలో ఇంటి నిర్మాణ అనుమతులకు ఏ స్థాయిలో దరఖాస్తులు వస్తాయో, అంతే స్థాయిలో భవన నిర్మాణం పూర్తి చేసుకున్నాక సదరు యాజమాని ఓసీ (ఆక్యుపెన్సీ సర్టిఫికెట్) పొందేందుకు దరఖాస్తులు చేసుకుంటారు. జీహెచ్ఎంసీ పరిధిలో రోజూ వందల సంఖ్యలో ఓసీ దరఖాస్తులు కొత్తగా వస్తుంటాయి. బిల్డ్‌నౌ విధానంలో ఓసీ ఆప్లికేషన్‌కు అవకాశం లేదు. దరఖాస్తు సమయంలో ఈ ఆప్షన్ కనబడటం లేదు. దీనికి తోడుగా ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) అనుమతులకు స్థానం కల్పించలేదు. టీడీఆర్ పత్రం కలిగిన వారు, జీహెచ్ఎంసీ బహుళ అంతస్థుల భవనాల నిర్మాణానికి ఇచ్చే అనుమతికి అదనంగా చేపట్టే నిర్మాణ వైశాల్యాన్ని నిబంధనలను అనుసరించి క్రమబద్ధీకరించుకోవచ్చు. టీడీఆర్‌తో అదనపు అంతస్థు కట్టాలనుకునే వారికి నిరాశే ఎదురవుతున్నది. వచ్చే నెల 2 నుంచి టీజీ బీ-పాస్ ఉండదని చెప్తున్న అధికారులే... వారం రోజుల ముందు నుంచే పాత విధానంలో ఏ ఒక్క అనుమతినీ తీసుకోకపోవడం పట్ల నిర్మాణదారులు, ఆర్కిటెక్ట్‌లు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

పాత ఉద్యోగులు ఔట్ ?

టీజీ బీ-పాస్ నిర్వహణను సాఫ్ట్‌టెక్ కంపెనీ చూస్తున్నది. ఈ కంపెనీకి సంబంధించిన దాదాపు 30 మందికిపైగా ఉద్యోగులు జీహెచ్ఎంసీలో పనిచేస్తున్నారు. కొత్త విధానం రాకతో వీరి ఉద్యోగాలకు ఫుల్‌స్టాప్ పడనున్నది. ఒకరిద్దరు మినహా పాత వారిని అందరినీ పంపించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నెల వ్యవధిలో అందరికీ నోటీసులు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

ఎందుకీ ఈ తొందర?

ఏదైన నూతన విధానాన్ని ఆమలు చేసే ముందు పూర్తిస్థాయిలో సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి. ఎదురయ్యే సమస్యలను ముందే అంచనా వేసి అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ బిల్డ్‌నౌ విధానంలో ఇదే లోపించింది. నిర్మాణ అనుమతులను నిర్ణీత కాలవ్యవధిలో పొందడంతోపాటు అన్ని అనుమతులను సింగిల్‌విండో సిస్టంలో తీసుకునేలా రూపొందించామని, దేశంలోనే తొలిసారిగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్ టెక్నాలజీతో రూపొందించిన బిల్డ్‌నౌ నిర్మాణరంగ అనుమతుల్లో నూతన విప్లవం అని ప్రభుత్వం చెప్తున్నది. కానీ, కొత్త విధానం ఆమల్లోకి వచ్చి ఎనిమిది రోజులు గడిచినా కొన్ని అనుమతులకు అవకాశం కల్పించలేదు. నూతన విధానం అమలులో సమస్యలు రావడం సహజమని, తొలి ఆరు నెలలపాటు సమస్యలు ఏదో రూపంలో వస్తుంటాయని అధికారులు చెప్తున్నారు. దీనినిబట్టి వచ్చే ఆరునెలలపాటు అధికారులకు, నిర్మాణదారులకు ఇబ్బందులు తప్పవనే సంకేతాలు కనబడుతున్నాయి.

సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు పంపిస్తున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు

మాజీ సర్పంచుల పోస్టుకార్డు ఉద్యమం

- పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఎంకు ఉత్తరాలతో వినతి
- 16 నెలలుగా ప్రభుత్వం వేధిస్తున్నది
- సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. తమకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరాలు రాసి పంపారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ పోస్టాఫీసు దగ్గర సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడురు లక్ష్మీనర్సింహారెడ్డి శుక్రవారం ఉత్తరాలను పోస్టుడబ్బాలో వేసి ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పల్లెలను ఆదర్శంగా తీర్చిదిద్దితే కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేయకుండా 16 నెలలుగా తమను వేధిస్తున్నదని మండిపడ్డారు. అనేక నిరసనలు, ఉద్యమాలు చేపట్టినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ పెండింగ్ బిల్లులు చెల్లించాలని పోస్టుకార్డు ఉద్యమానికి రాష్ట్ర కార్యవర్గం శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్, ప్యాక్స్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

ఇక ప్రత్యక్ష ఆందోళనలే : యాదయ్యగౌడ్

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఇప్పటివరకు శాంతియుత కార్యక్రమాలు నిర్వహించామని, ఇక ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా రేవంత్ సర్కారు మొండివైఖరి ప్రదర్శిస్తున్నదని ధ్వజమెత్తారు. తక్షణమే బిల్లులు చెల్లించి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

4,740 పాఠశాలల్లో మరుగుదొడ్లులేవు

రాష్ట్రంలోని బడుల్లో అధ్వాన పరిస్థితులు

కాలకృత్యాలు తీర్చుకోవాలన్నా కష్టమే..

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : మూడు లక్షల కోట్ల బడ్జెట్. ఈ మూడు లక్షల కోట్లల్లో విద్యారంగం వాటా 23వేల కోట్లు. సర్కారు బడుల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పాఠాలు. 15వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు. ఇది సర్కారు వారు డబ్బా. ఇది ఒక పార్శ్వమైతే. మరో పార్శ్వంలో రాష్ట్రంలోని 4,740 సర్కారు బడుల్లో టాయిలెట్లు లేవు. మరీ ముఖ్యంగా 1,704 స్కూళ్లల్లో బాలికలకు టాయిలెట్ వసతి లేదు. ఇంతటి అధ్వాన పరిస్థితులు రాష్ట్రంలోని సర్కారు బడుల్లో నెలకొన్నాయి. ఈ బడుల్లో ఒంటికి.. రెంటికి పోవడం, కాలకృత్యాలు తీర్చుకోవడం సమస్యగా మారింది. విద్యాశాఖ లెక్కల ప్రకారం.. ప్రతి 80 మంది విద్యార్థులకు ఒక టాయిలెట్ చొప్పున ఉండాలి. కానీ 18.58శాతం పాఠశాలల్లో బాలురకు టాయిలెట్లు లేవు. మరో 6.75శాతం పాఠశాలల్లో బాలికల టాయిలెట్లు లేకపోవడం ఆందోళనకరం. బడుల్లో బాలికలు టాయిలెట్లు లేని కారణంగా మంచి నీళ్లు కూడా తాగడం మానేస్తున్నారు. దీంతో అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నారు. తగినంత నీళ్లు తాగకపోవడంతో, మూత్రపిండాల ఇన్‌ఫెక్షన్‌సహా ఇతర రోగాల పాలవుతున్నారు.

వాస్తవ పరిస్థితులిలా..

- *సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 396 పాఠశాలల్లో ఒక్కటంటే ఒక్క టాయిలెట్ కూడా లేదు. ఆ తర్వాత మహబూబ్‌నగర్‌లో 249, కామారెడ్డిలో 246 చొప్పున పాఠశాలల్లో టాయిలెట్లు లేవు.*
- *వికారాబాద్ జిల్లాలో 223, నిజామాబాద్‌లో 213, నిర్మల్‌లో 211, భద్రాద్రి కొత్తగూడెంలో 203 స్కూళ్లల్లో టాయిలెట్లు లేని పరిస్థితి నెలకొన్నది.*
- *అర్బన్ ప్రాంతం, రాష్ట్ర రాజధాని అయిన హైదరాబాద్‌లోనూ 50, మేడ్చల్ మల్కాజిగిరిలో 46 పాఠశాలల్లో టాయిలెట్ల లేమి సమస్య పట్టిపీడిస్తున్నది.*
- *చిన్న జిల్లాలైన నారాయణపేటలో 158, ములుగులో 41 పాఠశాలల్లో దారుణమైన పరిస్థితులున్నాయి.*
- *సెమీఅర్బన్ జిల్లాలైన రంగారెడ్డిలో 180 స్కూళ్లల్లో టాయిలెట్లు లేవు. హనుమకొండలో 49, వరంగల్‌లో 69 పాఠశాలల్లో దారుణమైన పరిస్థితులున్నాయి.*
- *గిరిజన ప్రాంతాలతో కూడిన జిల్లాల్లో ఈ సమస్య తీవ్రత అధికంగా ఉంది. కుమ్రంబీం ఆసిఫాబాద్‌లో 169, మహబూబాబాద్‌లో 133 చొప్పున పాఠశాలల్లో విద్యార్థుల తిప్పలు వర్ణణాతీతం.*

రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయాల్సిందే

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాల్సిందేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూమ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్ పేదలకు అనుకూలమైంది కాదని విమర్శించారు. ఆసరా పింఛన్‌లను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంపు, మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మి/ షాదీముబారక్ పథకంలో రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీల అమలుపై దృష్టి సారించాలని కోరారు. సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడంలేదని గురువారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం చెప్పడం తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం చేయడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణపై కేంద్రం సవతితల్లి ప్రేమ చూపిస్తున్నదని విమర్శించారు.

రిటైర్డ్ ఉద్యోగులను పంపిస్తారా?

- అధికారులు, ఉద్యోగులపై ప్రభుత్వ వైఖరిలో అస్పష్టత
- అనుకూల అధికారులను కొనసాగించేందుకు ప్రణాళిక
- ఎక్స్‌టెన్షన్‌పై ఉన్న అధికారుల తొలగింపు ఉత్తదేనా?
- సీఎస్ ఆదేశాలు ప్రచార ఆర్భాటమేనా?

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వంలో వివిధ పద్ధతుల్లో కొనసాగుతున్న విశ్రాంత ఉద్యోగుల తొలగింపుపై సీఎస్ శాంతికుమారి ప్రకటన చేశారు. కానీ ఉత్తర్వులు ఉత్తముచ్చటేనని ప్రభుత్వవర్గాల్లోనే చర్చ జరుగుతున్నది. ఎక్స్‌టెన్షన్ ఇస్తే చిక్కులు వస్తాయని గుర్తించి, అందరినీ తొలగించి, ఆ తర్వాత అనుకూల అధికారులను తిరిగి తీసుకొచ్చేందుకు ప్రభుత్వంలోని కొందరు ప్లాన్ చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులోనే వెసులుబాటు ఇచ్చారని సచివాలయవర్గాల్లో చర్చ నడుస్తున్నది.

ఉత్తర్వులు సంగతేంటి?

ప్రభుత్వంలో పదవీ విరమణ తర్వాత కూడా 6,729 మంది అధికారులు, ఉద్యోగులు ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగుతున్నారు. వివిధ శాఖలు, ప్రభుత్వ బోర్డులు, కార్పొరేషన్లు, ఏజెన్సీలలో ఎక్స్‌టెన్షన్, రీఅపాయింట్‌మెంట్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో ఐఏఎస్ అధికారుల నుంచి అటెండర్ల వరకు ఉన్నారు. వీరందరినీ ఈ నెల 31లోగా తొలగించాలని సీఎస్ శాంతికుమారి ఇటీవల అన్నిశాఖలకు ఉత్తర్వులు జారీచేశారు. ఆది, సోమవారం సెలవు దినాలు కావడంతో ప్రభుత్వం విధించిన గడువుకు నేటితో ముగియనుంది. కానీ ప్రభుత్వ ఉత్తర్వులోనే చిన్న మినహాయింపు ఇచ్చారు. ఏదైనా శాఖలో విశ్రాంత అధికారి లేదా ఉద్యోగి సేవలు అత్యవసరం అనుకుంటే అందుకు ఆ శాఖ అధిపతి జస్టిఫికేషన్ ఇస్తే ఆ వివరణను పరిశీలించి సదరు అధికారి/ఉద్యోగిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలా? వద్దా? అనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటున్నదని ఉత్తర్వులోనే స్పష్టంచేశారు. ఈ ఒక్క వెసులుబాటు ద్వారా కాంగ్రెస్ సర్కారు తమకు అనుకూల అధికారులను మళ్లీ యథాస్థానంలో కూర్చోబెట్టే అవకాశమున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కొందరికి మినహాయింపు ఇస్తారా?

మంత్రుల వద్ద పనిచేస్తున్న విశ్రాంత అధికారులు, ఉద్యోగులకు టెర్మినేషన్ నుంచి మినహాయింపు లభించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తున్నది. గనులశాఖ నుంచి సుశీల్ కుమార్, మెట్రోరైల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి, మూసీరివర్ ఫ్రంట్ /వాటర్ బోర్డు నుంచి సత్యనారాయణ, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులును యథాస్థానాల్లో కొనసాగించే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. వివిధ శాఖల్లో కొనసాగుతున్న చాలా మంది రిటైర్డ్ అధికారులకు లక్షల్లో వేతనాలు చెల్లిస్తున్నారు. అలా ఒక్కరికి చెల్లించే వేతనంతో నలుగురు కొత్త ఉద్యోగులను ఆ శాఖలోకి ఎలాంటి ఆర్థికభారం లేకుండా తీసుకునే అవకాశాలు ఉన్నాయని నిరుద్యోగులు చెప్తున్నారు. ప్రభుత్వం నిజాయతీగా వ్యవహరించి, విశ్రాంత ఉద్యోగులు అందరినీ తొలగించి యువతకు కొత్త ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించాలని నిరుద్యోగ జేఏసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సగంతో సరిపెడదాం!

- మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై వెనక్కు తగ్గిన కాంగ్రెస్
- బెడిసికొట్టిన ముఖ్యనేత ఎత్తులు
- ఎదురు తిరిగిన దక్షిణ తెలంగాణ నేత
- పునరాలోచనలో అధిష్ఠానం

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): మంత్రివర్గ కూర్పుపై ముఖ్యనేత ఎత్తులు బెడిసికొట్టినట్టు కాంగ్రెస్ శ్రేణుల్లో ప్రచారం జరుగుతున్నది. అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటే ప్రభుత్వ మనుగడే ప్రమాదంలో పడిపోయే అవకాశం ఉన్నదనే సంకేతాలు అందటంతో కాంగ్రెస్ అధిష్ఠానం అప్రమత్తమైనట్టు తెలిసింది. ముఖ్యనేత సూచనలు, నివేదికల మేరకు ఇద్దరు మంత్రులను తొలగించి, కొంతమంది మంత్రుల శాఖల్లో మార్పులతో మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించాలని భావించిన ఆధిష్ఠానం, దక్షిణ తెలంగాణకు చెందిన ఓ నేత ఇచ్చిన ధమ్కీతో వెనక్కు తగ్గినట్టు ఢిల్లీ వర్గాలు చెప్తున్నాయి. పాత మంత్రివర్గాన్ని కదపకుండా ఖాళీగా ఉన్న ఆరు స్థానాల్లో ఇప్పుడు నాలుగు మాత్రమే నింపి, మరో రెండు స్థానాలు ఖాళీగా పెట్టడం ద్వారా ఆశావాహులను ఊరిస్తూ ప్రమాదం నుంచి గట్టెక్కాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది.

ఎవరి జాబితా వాళ్లదే

మంత్రివర్గ విస్తరణకు అధిష్ఠానం నుంచి వచ్చిన గ్రీన్ సిగ్నల్ కాంగ్రెస్‌లో పెను దుమారాన్నే రేపుతున్నది. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న ఆరు స్థానాలకు 30 మంది పోటీపడుతున్నారు. అధిష్ఠానం దూత మీనాక్షి నటరాజన్ తెలంగాణకు వచ్చి 20 రోజులపాటు ఇక్కడే మకాం వేసి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆమె నుంచి అందిన సూచనల మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ ఢిల్లీకి వెళ్లి అధిష్ఠానంతో కూర్పుపై చర్చించి వచ్చారు. నలుగురిలో సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు కలిసి ఒక జాబితా, భట్టి, ఉత్తమ్ చెరో జాబితా అధిష్ఠానానికి ఇచ్చినట్టు తెలిసింది. సీఎం ఇచ్చిన జాబితాలో సుదర్శన్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, గడ్డం వివేక్ పేర్లు ఉన్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఉత్తమ్ జాబితాలో ఆయన భార్య పద్మావతి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, దొంతి మాధవరెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వినోద్ పేర్లు ఉన్నట్టు సమాచారం. ఇక భట్టి విక్రమార్క జాబితాలో వాకిటి శ్రీహరి, ప్రేమ్‌సాగర్‌రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి, బాలు నాయక్, దొంతి మాధవరెడ్డి పేర్లు ఉన్నట్టు చర్చ జరుగుతున్నది. వాకిటి శ్రీహరి పేరును కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా సూచించినట్టు ఢిల్లీ పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

బంజారాలకు మళ్లీ మొండిచేయేనా..?

సీతక్కకు హోంమంత్రిగా పదోన్నతి కల్పించి, ఎస్టీలకు ఒకే ఒక్క బెర్త్‌తో సరిపెడతారన్న ప్రచారం జరుగుతున్నది. దీనిపై బంజారా గిరిజన శక్తి, బంజారా విద్యార్థి సంఘాలు ఆందోళన బాట పట్టాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టిన లంబాడ గిరిజన సంఘాలు శుక్రవారం ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇప్పుడున్న కూర్పులో అటు బంజారాలకు కానీ, ఇటు ఎస్సీ మాదిగలకు గానీ బెర్తు దొరికే అవకాశం లేదని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

దక్షిణ తెలంగాణ నేతల ధమ్కీతో ..

తన డబ్బుతో ఆధికారంలోకి వచ్చి తనకే ఉనికి లేకుండా ముఖ్యనేత పావులు కదుపుతున్నారని ఆగ్రహించిన దక్షిణ తెలంగాణకు చెందిన ఓ మంత్రి ఎట్లా పునర్వ్యవస్థీకరణ చేస్తారో చూస్తానంటూ పార్టీకి అల్టిమేటం పంపినట్టు సమాచారం. తన భార్యకు మంత్రి పదవి ఇవ్వకుంటే ఊరుకునేది లేదని ఉత్తమ్ గట్టి పట్టుదలతో ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఉత్తమ్‌ను ఒప్పించిన తరువాతే మంత్రివర్గ కసరత్తుపై ముందుకు వెళ్లాలని సోనియా గాంధీ ఏఐసీసీ నేతలకు నిర్దేశించినట్టు ఢిల్లీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇంకోవైపు సుదర్శన్‌రెడ్డి పేరు తెరమీదకు రావటంతో నర్సంపేట ఎమ్మెల్యే, సీనియర్ కాంగ్రెస్ నేత దొంతి మాధవరెడ్డి ఢిల్లీ వెళ్లారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిశారు. మరింత కొంతమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కలిసేందుకు ఢిల్లీ బాట పడుతున్నారు.

ఆ జిల్లాల్లో కూర్పు సమస్య..

మంత్రివర్గంలో రంగారెడ్డి, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన నేతలకు చోటు లభించలేదు. ఈ మూడు జిల్లాలకు కనీసం ఒక్కొక్కరి చొప్పునైనా అవకాశం కల్పించాల్సి ఉంది. నిజామాబాద్ జిల్లా నుంచి సీఎం రేవంత్‌తో సఖ్యతగా ఉండే బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేరును సూచించినట్టు తెలిసింది. ఇదే జిల్లా నుంచి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కూడా ఎస్సీ మాదిగ సామాజికవర్గం కోటా కింద మంత్రి పదవిని ఆశిస్తున్నట్టు సమాచారం. రంగారెడ్డి జిల్లా నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కాలె యాదయ్య పోటీపడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి గడ్డం వివేక్ పేరు బయటికి రావటంతో ఆగ్రహిస్తున్న మాదిగ సామాజికవర్గం ఎమ్మెల్యేలు ఆరుగురు అధిష్ఠానానికి లేఖలు రాసినట్టు సమాచారం.

ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏఐ సిటీ

మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : 200 ఎకరాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఏఐ సిటీని నిర్మిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఉగాది తర్వాత మహేశ్వరంలో ఏఐ సిటీ నిర్మాణానికి భూమి పూజ చేసేందుకు ఏర్పాట్లుచేస్తున్నట్టు తెలిపారు. హైటెక్ సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో శుక్రవారం క్లియర్ టెల్లిజెన్స్ ఇండియా డెలివరీ అండ్ ఆపరేషన్స్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. భావితరాల అవసరాలకు అనుగుణంగా ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. ఇప్పటికే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను ప్రారంభించామని, త్వరలోనే క్వాంటం కంప్యూటింగ్‌లోనూ ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు.

ఏప్రిల్ వరకు పాత పవర్ టారిఫే

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో విద్యుత్తు చార్జీల టారిఫ్ ఖరారు ప్రకటనను విద్యుత్తు నియంత్రణ మండలి వాయిదావేసింది. ఏప్రిల్ వరకు పాత టారిఫే కొనసాగుతున్నది. 2025-26 వార్షికాదాయ ఆవశ్యకత (ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనలపై విద్యుత్తు నియంత్రణ మండలి(ఈఆర్సీ) ఇటీవలే బహిరంగ విచారణ జరిపింది. విద్యుత్తు సంస్థలు చార్జీలు పెంచబోమంటూ ఈఆర్సీ ముందు వాదనలు వినిపించాయి.

4,818 చలివేంద్రాలు

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 4,818 చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లాలో 458, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 8 ఏర్పాటు చేశారు.

ఎస్ఎస్ఏఏటీ డైరెక్టర్‌గా నిర్మల

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్, అకౌంటబిలిటీ అండ్ ట్రాన్స్‌పరెన్సీ బోర్డు డైరెక్టర్‌గా నిర్మల నియమితులయ్యారు. ప్రభుత్వ కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు.

సీఎంఆర్‌లో అవకతవకలు.. ముగ్గురిపై వేటు

నిర్మల్ డీఎస్‌వోపాటు డీఎం, డీటీ సస్పెన్షన్

నిర్మల్, మార్చి 28(నమస్తే తెలంగాణ): నిర్మల్ జిల్లాలో జరుగుతున్న కోట్ల రూపాయల కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అక్రమాలపై ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించింది. కొంతమంది మిల్లర్లు సీఎంఆర్ కోసం ప్రభుత్వం నుంచి ధాన్యాన్ని తీసుకొని సకాలంలో బియ్యాన్ని తిరిగి ఇవ్వకుండా, వేలాది మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పక్కదారి పట్టించారు. ఆ మిల్లర్లపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిన జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్‌కుమార్, పౌర సరఫరాల సంస్థ డీఎం గోపాల్‌తోపాటు నర్సాపూర్(జీ) ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రమాదేవిని సస్పెండ్ చేస్తూ రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా వ్యాప్తంగా పలు మిల్లుల్లో రూ.100 కోట్లకు పైగా జరిగిన ధాన్యం అక్రమాలకు సంబంధించి ఇద్దరు జిల్లా అధికారులు, మండల అధికారిని ఒకేసారి సస్పెండ్ చేయడం అధికారవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజుల క్రితం నర్సాపూర్ (జీ) మండలం అర్లి శివారులోని ద్వారకామయి ఆగ్రో ఇండస్ట్రీస్‌లో జరిగిన రూ.48 కోట్ల విలువైన ధాన్యం అక్రమాలకు సంబంధించి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ టాస్క్ ఫోర్స్ బృందాలు ప్రత్యేకంగా దర్యాప్తు చేశాయి. ఈ మిల్లులో గత నాలుగు సీజన్ల నుంచి అక్రమాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతోనే ప్రభుత్వానికి తీవ్ర నష్టం వాటిల్లినట్టు గుర్తించారు.

బార్ల సమస్యలు పరిష్కరించండి

- తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్
- హైదరాబాద్‌లోని ఆబ్కారీ ఆఫీసు ఎదుట ఆందోళన

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): బార్ల సమస్యలు పరిష్కరించాలని, వైన్‌షాపుల సమయపాలన తగ్గించాలని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఓనర్లు ఆబ్కారీ శాఖ కార్యాలయం ఎదుట అసోసియేషన్ నాయకులు ఆందోళనకు దిగారు. వైన్‌షాపుల వద్ద పర్మిట్ రూంలతో వ్యాపారం దెబ్బతింటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు యజమానులు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని తెలిపారు. జిల్లాల్లో వైన్ షాపులు ఉదయం 10నుంచి రాత్రి పది వరకు నడుస్తున్నాయని, జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రం రాత్రి 11 గంటల వరకు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాల్లో వేళల మాదిరిగానే జీహెచ్ఎంసీ పరిధిలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.